క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : మండల పరిధిలోని దురాజ్‌పల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని దురాజ్‌పల్లి, ఖాసీంపేట, వల్లభాపురం, తిమ్మాపురం గ్రామాల్లో మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

సైకిల్ చోరీ

అర్వపల్లి : అర్వపల్లిలోని జాజిరెడ్డిగూడెంరోడ్డులో కేఆర్ ఎలక్ట్రికల్ దుకాణం ఎదుట నిలిపి ఉన్న సైకిల్‌ను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. దీంతో స్థానికులు జిన్నె అశ్విన్, పోలోజు మధులు సైకిల్ చోరీ చేసిన వ్యక్తి కోసం గాలించారు. జాజిరెడ్డిగూడెం శివారులోని మూసీనది వంతెన వద్ద సైకిల్‌తో వెళ్తుండగా అతడిని పట్టుకుని, సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దొంగను మందలించి వదిలేశారు.

ఆర్థికసాయం అందజేత


నివాళులర్పిస్తున్న నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన కోదాటి సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గుజ్జ యుగంధర్ రావు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములు గౌడ్, గోపగాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : పత్తి పంటలో నానో యూరియా, నానో డీఏపీ వాడే పద్ధతిపై మండల పరిధిలోని మాచారం గ్రామంలో కేవీకే శాస్త్రవేత్త అరిగేల కిరణ్ శుక్రవారం క్షేత్రపరిశీలన చేసి రైతులకు అవగాహన కల్పించారు. పాత పద్ధతుల తోపాటు కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్ మాట్లాడారు. పత్తిలో తొలి దశలో ఆశించే రసం పీల్చే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఐదుగురు రైతులకు నానో యూరియా ప్లస్, నానో డీఏపీ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కేవీకే యంగ్ ప్రొఫెషనల్ జి.సంతోష్, రైతులు అచ్చయ్య, సతీష్, రాములు, సైదులు, లింగయ్య పాల్గొన్నారు.

రూ.40 లక్షలు మంజూరు

అర్వపల్లి : వ్యవసాయ రుణాల కోసం జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండలంలోని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు తగిన ధ్రువపత్రాలను సమర్పించి రుణాలు పొందాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది మహేందర్, శ్రీకాంత్, సైదులు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తుంగతుర్తి : స్వచ్ఛందంగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తుంగతుర్తి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తల్లాడ కేదారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రామాలయంలో లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. అనంతరం రామాలయ పూజారి కాటూరి రామాచార్యులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి గుండగాని రాము, క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, ఓరుగంటి సుభాష్, ఎనగందుల గిరి, రామాలయ చైర్మన్ ఎనగందుల సంజీవ, గుడిపూడి లక్ష్మణరావు, పులుసు వెంకటనారాయణ గౌడ్, తల్లాడ పద్మ, సూర్యకళ, రాణి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

పెన్‌పహాడ్ : దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మేకల నాగరాజు–మంగమ్మ దంపతులు కుమారుడు మేకల విక్రం జన్మదినం సందర్భంగా శుక్రవారం రూ.6500 విలువ చేసే పరీక్ష ప్యాడ్లు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పిండిగ నరసయ్య మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకారం అందించడం అభినందనీయమన్నారు. అదే విధంగా పాఠశాల పరిసరాలను దాత నాగరాజు డోజర్ సాయంతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల తరఫున సన్మానించారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు


మంగళితండాలో రహదారిపై నిలిచిన నీరు


వట్టిఖమ్మంపహాడ్‌లో అధ్వానంగా అంతర్గత రహదారి

- గుంతలమయమై, వర్షాలకు చిత్తడిగా మారుతున్న వీధులు
- డ్రెయినేజీల నిర్వహణ సరిగాలేక రోడ్లపైకి చేరుతున్న మురుగు

చివ్వెంల : అంతర్గత రహదారులు గుంతలమయంగా మారడం, మురుగు కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో చివ్వెంల మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వాల్యతండా, పాశ్యానాయక్‌తండా, బద్యాతండా, ఎర్ర సూర్యాతండా, రోళ్లబండ తండా, మల్యాతండా, వట్టిఖమ్మంపహాడ్, మంగళితండా, వెంకట్‌తండా, రాజుతండా, పాండ్యానాయక్‌తండా, మోదిన్‌పురం గ్రామాల్లో అంతర్గత రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ బురదమయంగా మారి నడవడానికి కూడా వీలు లేకుండా ఉంటుంది. గుంతల్లో మురుగు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలంలో దుమ్ము, వానాకాలంలో బురదతో ప్రజలు చాలా కాలంగా సహవాసం చేస్తున్నారు.

మురుగు కాలువల నిర్వహణపై నిర్లక్ష్యం..

పులితండా, జయరాంగుడితండా, లక్ష్మణ్‌నాయక్ తండా, అక్కలదేవిగూడెం, గుంపుల, బి.చందుపట్ల, ఐలాపురం, గాయంవారిగూడెం వంటి గ్రామ పంచాయతీల్లో మురుగు కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. దీనివల్ల మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్వాసనతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. కొన్నిచోట్ల మురుగు కాలువలు ఉన్నా, వాటిని సరిగా నిర్వహించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మరికొన్ని గ్రామాల్లో అసలు మురుగు కాలువలే లేకపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. ఈ సమస్యలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వెంటనే అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని, మురుగు కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

తండాలోని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలి. వర్షాకాలం వస్తే గ్రామంలోని వీధుల్లో వర్షపు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నీరు నిల్వడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. అంతేకాకుండా వీధుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– శ్రీను, మంగళితండా

అధికారులకు విన్నవించాం

గ్రామంలోని కొన్ని విధుల్లో సీసీ రోడ్లు వేయాలని అధికారులుకు విన్నవించాం. చిన్నపాటి వర్షానికే గ్రామంలోని రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. అంతేకాకుండా గుంతలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి సీసీ రోడ్లు నిర్మించాలి.

– కిరణ్, వట్టిఖమ్మంపహాడ్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మందుల సామేల్


వెలుగుపల్లిలో అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో అంగన్వాడీ భవనం, గ్రామ పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, టీపీసీసీ మెంబర్ గుడిపాటి నరసయ్య, ఎంపీడీఓ శేషు కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్, సోమ్లా నాయక్, శ్రీరంగం, మల్లేష్, దాసరి శ్రీను, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం పేదలకు కొండంత అండ

ఇందిరమ్మ రాజ్యం పేదలకు కొండంత అండ అని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తుంగతుర్తికి చెందిన నిరుపేద మహిళలు వివిధ పత్రికల ద్వారా విజ్ఞప్తి చేయడంతో శుక్రవారం ఆయన స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి కుటుంబాల పరిస్థితి తెలుసుకొని మాట్లాడారు. నిరుపేద మహిళలైన గాదంగి ఉమ, అనూష, రేణుకకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషు కుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, అజయ్, మల్లేష్, దాసరి శ్రీను, కొండ నాగరాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు.. శిశువు ఆరోగ్యానికి మేలు


బాలింతలకు ముర్రుపాల విశిష్టత వివరిస్తున్న మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులు, డాక్టర్లు

సూర్యాపేటటౌన్ : శిశువు పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలు తాపిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గల ప్రసూతి విభాగాన్ని ఆమె సందర్శించారు. బాలింతలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు తాపించడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, చిన్నపిల్లల వైద్యులు శ్రీకాంత్, ఆర్ఎం సంధ్య, ప్రాజెక్టు అధికారులు ఎం.సుబ్బలక్ష్మి, కిరణ్మయి, సూపర్‌వైజర్లు ఆర్.జ్యోతి, ఉపేంద్రమ్మ, కె.ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి ఎం.రాములు నాయక్ అన్నారు. నూతనకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి నూతనంగా 100 అడ్మిషన్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంకితభావం, అనుభవం కలిగిన ఉపాధ్యాయుల కృషి ఫలితంగా గతేడాది పదో తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అలాగే ఎన్ఎంఎంఎస్‌లో ఆరుగురు విద్యార్థులు సీట్లు పొందారని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు 100 సంఖ్య ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చివ్వెంల : అక్రమంగా సిమెంట్‌ను విక్రయిస్తున్న లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామానికి చెందిన పోలోజు ఉపేందర్ ఎన్సీఎల్ సిమెంట్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో లారీ ఆపి సిమెంట్ వ్యాపారం చేస్తున్న కాసటి రాజుకు తక్కువ ధరకు లారీలో ఉన్న కొంత సిమెంట్‌ను విక్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న కంపెనీ సూపర్‌వైజర్ మాదా ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు ఎస్ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారత్‌పై ట్రంప్ ద్వంద్వ వైఖరిని ఖండించాలి

సూర్యాపేట అర్బన్ : మనదేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. భారతదేశంపై ట్రంప్ 25 శాతం సుంకాలను విధించడాన్ని ఖండిస్తూ సూర్యాపేట పట్టణంలోని విక్రమ్ భవన్ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్-రష్యా చేసుకున్న వాణిజ్య, రక్షణ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ట్రంప్ హుకం జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పేర్ల నాగన్న, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు గొడ్డలి నరసన్న, నాయకులు ఎస్‌కే గులాం, సాహెబ్ హుస్సేన్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మస్థల ఘటనపై ప్రతి ఒక్కరూ స్పందించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

సూర్యాపేటఅర్బన్ : ధర్మస్థల ఘటనపై ప్రతి ఒక్కరూ స్పందించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు పుస్తెల సృజన అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని రాఘవ్ ప్లాజా వద్ద ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో ముఖానికి నల్ల బ్యాడ్జీలు కట్టుకొని, ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. మౌనం పాటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థల పుణ్యక్షేత్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోందన్నారు. తక్షణమే విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో 'న్యూస్ ఛానల్'


వార్తలు చదువుతున్న విద్యార్థులు

సూర్యాపేట : ఇమాంపేట మోడల్ స్కూల్ పేరుతో ఆ పాఠశాల విద్యార్థులు న్యూస్ ఛానల్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ జి.రమేష్ టీజీఎంఎస్ ఇమాంపేట న్యూస్ ఛానల్‌ను ప్రారంభించినట్లు ఆ పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు దండెం రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ న్యూస్‌ఛానల్ ద్వారా 8, 9, 10వ తరగతి విద్యార్థులతో పాఠశాలలో ప్రతి నెలా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వార్తలను చదివించనున్నట్లు ఆయన తెలియజేశారు.

ఆలయాల్లో వైభవంగా కుంకుమార్చన పూజలు


శ్రీసంతోషిమాత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


శ్రీసంతోషిమాత ఆలయంలో గోవును పూజిస్తున్న భక్తులు

సూర్యాపేట : శ్రావణమాసం రెండవ శుక్రవారం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణ శర్మ భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు జరిపారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీ చక్రంకు పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సంతోషిమాత ఉద్యాపన వ్రతం చేపట్టి, అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. అమ్మవారిని ప్రత్యేక ఊయలలో ఉంచి పవళింపు సేవ, సాయంత్రం వేళ వైభవలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, ఉప కోశాధికారి కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్ రావు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, సోమ శ్రీశైలం, బెలిదే అశోక్, పబ్బా ప్రకాశరావు, తాళ్లపల్లి రామయ్య, బ్రాహ్మణపల్లి బాలచంద్రుడు, బ్రాహ్మణపల్లి శివప్రసాద్, దేవరశెట్టి సోమయ్య, నూకా రవి శంకర్, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


చివ్వెంల : ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో..

పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాస రెండవ శుక్రవారం సందర్భంగా లక్ష్మీ అమ్మవారికి విశేష తిరుమంజనం స్నపనం నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి సహస్రనామాలతో లక్ష కుంకుమార్చన జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు మాట్లాడుతూ అమ్మవారి వైభవాన్ని భక్తులకు వివరించారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ..

శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి సంవత్సరం నిర్వహించే పవిత్రోత్సవాలకు శుక్రవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

చివ్వెంల : శ్రావణ మాసం స్వాతి నక్షత్రం సందర్భంగా మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు అరుట్ల రవికుమార చార్యులు, క్రిష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రామయ్య, క్రిష్ణకుమార్, శ్రీనివాస్ రెడ్డి, నర్సయ్య, మురళీ క్రిష్ణ పాల్గొన్నారు.

కిట్స్ కాలేజీ చైర్మన్, కుటుంబ సభ్యులపై దాడి

చివ్వెంల : గుంపుల గ్రామం సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కిట్స్ కాలేజీ చైర్మన్, కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపర్చారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని కిట్స్ కాలేజీ చైర్మన్ నీలా సత్యనారాయణ తన కూతుళ్లతో కలిసి గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి కోదాడకు వెళ్తున్నాడు. అయితే వారి కారును వెంబడించిన దుండగులు మండల పరిధిలోని గుంపుల గ్రామ శివారులోకి రాగానే అడ్డగించి, కారు అద్దాలు ధ్వంసం చేశారు. అంతేకాకుండా వారిపై పెప్పర్ స్ప్రే చల్లారు. నీలా సత్యనారాయణను బయటకు లాగి గాయపర్చారు. అడ్డు వచ్చిన అతడి కుమార్తెలపై కూడా దాడి చేశారు. వెంటనే నీలా సత్యనారాయణ ఈ విషయాన్ని పోలీస్ స్టేషన్‌లో తెలియజేశారు. తమపై దాడి చేసిన వ్యక్తి తుమ్మెపల్లి మల్లిఖార్జున్ అని నీలా సత్యనారాయణ కుమార్తె విద్య తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణ ప్రస్తుతం సూర్యాపేట హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సూర్యాపేట అర్బన్ : అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్ : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం వందరోజుల ప్రణాళికలో భాగంగా 4వ వార్డులో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ముందుండాలని అన్నారు. పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు, హెల్త్ వర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.

పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

అర్వపల్లి : విద్యార్థులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ కోరారు. జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులు–తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం.బిచ్చునాయక్, ఇన్‌చార్జ్ హెచ్ఎం కేసీహెచ్. వెంకటరెడ్డి, డాక్టర్ ఉదయ్‌కుమార్, ఏఎన్ఎంలు సైదమ్మ, శకుంతల, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని బక్కహేమ్లాతండాలో పరిసరాల పరిశుభ్రతపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సారథి జిల్లా టీమ్ లీడర్ పల్లెల లక్ష్మణ్ మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే దోమలు, ఈగలు వ్యాప్తి చెంది అనేక రోగాలకు కారణమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు గంట భిక్షపతి, పాలకుర్తి శ్రీకాంత్, పల్లెల రాము, గద్దం ఉదయ్, పాక ఉపేందర్, నాగలక్ష్మి, గజ్జి మంజుల, రాధ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ విధానం రద్దుచేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : నీట్, ఇంజనీరింగ్ సీట్లతోపాటు ఉద్యోగాల భర్తీకి తెచ్చిన రోస్టర్ విధానం రద్దుచేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. రోస్టర్ విధానం అమలుకు జారీచేసిన జీఓ 99 ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం తిరుమలగిరిలో సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ గంట యాకూబ్, చింతపల్లి శేఖర్, సందీప్, జాన్‌వెస్లీ, అమృత, నగేష్, సాల్‌మోన్, రవి, ప్రకాష్, వెంకన్న, లారెన్స్, సురేష్, చింటు, రేణుక పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నాగారం : నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామం నుంచి నర్సింహులగూడెం మీదుగా తుంగగూడెం వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ వర్ధమానుకోట రహదారిపై గ్రామ రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి ప్రధానమంత్రి సడక్ యోజన కింద రూ.2.27 కోట్లు కేటాయించారని తెలిపారు. అయితే కాంట్రాక్టర్ కేవలం మోరీలు వేసి, పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని అన్నారు. వర్ధమానుకోట–నర్సింహులగూడెం రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలతో, బురదమయంగా మారిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కమ్మల మల్లేష్, బండగొర్ల ఎల్లయ్య, పంది సోమనర్సయ్య, గుండగాని కొమరయ్య, బట్టు సోమేష్, మహేష్, మెరుగు సోమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన


నెమ్మికల్లులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభాకర్

ఆత్మకూర్ (ఎస్) : సిగరెట్, బీడీ, గుట్కాలతో ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుందని, ధూమపానానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నెమ్మికల్ సంతలో ప్రజలకు విచిత్ర వేషధారణలో అవగాహన కల్పించారు. సిగరెట్, గుట్కా, పొగాకులతో కలిగే అనర్థాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాజు, మహేష్, పలు గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగారం : మండల కేంద్రానికి ఇటీవల మంజూరైన 24 ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా మరో 100 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓ మారయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మరో 100 ఇళ్లు మంజూరు చేస్తే అర్హులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎల్క సైదులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

నూతనకల్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందజేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నూతనకల్ మండల పరిధిలోని బక్కహేమ్లాతండాలో మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికీ రేషన్‌కార్డు ఇవ్వలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలో భాగంగా రేషన్‌కార్డులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, మోహన్‌నాయక్, దామోదర్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.